




# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 158 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- | శుక్రవారం 10 జనవరి 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepalligudem, Kadapa, Ongole


## నలుగురు పిల్లల్ని కంటే..
## రూ.లక్ష నజరానా: మధ్యప్రదేశ్ బోర్డు ఆఫర్

నలుగురు సంతానాన్ని కనే వారికి రూ. లక్ష నగదు ఇస్తామంటూ మధ్యప్రదేశ్లో ఓ బోర్డు చేసిన ప్రకటన వైరల్‌గా మారింది.





**భోపాల్, జనవరి 13, (రిపబ్లిక్ న్యూస్):** మధ్యప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పరశు రామ్ కల్యాణ్ బోర్డు ఓ ప్రకటన చేసింది. తమ కమ్యూనిటీని పెంచుకునేందుకు ఎక్కువ మంది సంతానాన్ని కనాలని పిలుపునిచ్చింది. నలుగురు పిల్లలను కనే బ్రాహ్మణ దంపతులకు రూ. లక్ష నజరానా ఇస్తామని ప్రకటించింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్లో జరిగిన ఓ కార్యక్రమంలో పరశురామ్ కల్యాణ్ బోర్డు అధ్యక్షుడు పండిత్ విష్ణు రాజోరియా ఈ ప్రకటన చేశారు. "మనం మన కుటుంబాలపై దృష్టి పెట్టడం మానేశాం. ఈ మధ్య యువత ఒక బిడ్డను కని ఆగిపోతున్నారు. ఇది చాలా సమస్యాత్మకంగా మారుతోంది. భవిష్యత్ తరాన్ని కాపాడాల్సిన బాధ్యత మనదే. అందుకే కనీసం నలుగురు సంతానం ఉండాలని కోర-ుతున్నా" అని రాజోరియా తెలిపారు. "నలుగురు పిల్లల్ని కనే మహిళలకు బోర్డు తరఫున రూ. లక్ష నజరానా అందిస్తాం. నేను బోర్డు అధ్యక్షుడిగా దిగిపోయిన తర్వాత కూడా ఈ అవార్డు కొనసాగుతుంది" అని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్ గా మారింది.

## నారావారిపల్లెలో పలు అభివృద్ధి పనులకు చంద్రబాబు శంకుస్థాపన

ఏపీ సీఎం చంద్రబాబు చిత్తూరు జిల్లాలోని నారావారిపల్లెలో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

**కుప్పం, జనవరి 13, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ సీఎం చంద్రబాబు చిత్తూరు జిల్లాలోని నారావారిపల్లెలో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.2 కోట్లతో రంగంపేటలో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.కోటితో జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి భూమిపూజ చేశారు. నారావారిపల్లెలో రూ.3 కోట్లతో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాలకు చౌక, నాణ్యమైన నిత్యావసరాల చేరవేతకు ఈజీ మార్ట్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. దీని ద్వారా ఆన్లైన్లో బుక్ చేసుకున్న మహిళా సంఘాలకు సరకులు అందనున్నాయి. నారావారిపల్లెలో మహిళలకు చంద్రబాబు ఎలక్ట్రిక్ ఆటోలు పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల్లో ఐక్యూ పెరుగుదలకు కేర్ అండ్ గ్రో సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. 8 అంగన్వాడీ కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేయనున్నారు.





## ఏపీలో జోరుగా కోడి పందేలు..
## చూసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు.



**అమరావతి, జనవరి 13, (రిపబ్లిక్ న్యూస్):** సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని సూరంపల్లి, రామవరప్పాడు, అంపాపురంలో వీటిని నిర్వహించారు. పల్లెల్లోని బరుల్లోనూ పందేలు ఏర్పాటు చేశారు. వీటిని చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. నందిగామ, చందర్లపాడులో ఈ పోటీలు సాగుతున్నాయి. కంచికచర్ల మండలం గండేపల్లి వద్ద టెంట్లు ఏర్పాటు చేసి భారీ ఎత్తున పందేలు నిర్వహిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడి పందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ప్రారంభించారు.

## పల్లెలు కళకళలాడుతుంటే సంతోషంగా ఉంది :డిప్యూటీ సీఎం పవన్



పండుగ సందడితో తెలుగు రాష్ట్రాల పల్లెలు శోభాయమానంగా మారాయని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.

**అమరావతి, జనవరి 13, (రిపబ్లిక్ న్యూస్):** పండుగ సందడితో తెలుగు రాష్ట్రాల పల్లెలు శోభాయమానంగా మారాయని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. "సూర్య భగవానుడు మకర రాశిలోకి ప్రవేశించే ఈ పుణ్య సమ-యాన ధాన్య రాశులను లోగిళ్లకు మో-సుకువచ్చే సంక్రాంతి వేళ భారతీయులందరికీ సంక్రాంతి శు భాకాంక్షలు. రంగవల్లులు.. గొబ్బెమ్మలు.. గంగిరెద్దులు.. హరిదాసులు.. భో-గిమంటలు.. పిండివంటల సమ్మేళనమే సరదాల సంక్రాంతి. అలాంటి సరదాల కోసం నగరాలన్నీ పల్లెలవైపు పరుగులు తీశాయి. ఇది ప్రజలకు పండుగపై ఉన్న మక్కువను తెలియజేస్తోంది. ఉపాధికోసం పల్లె బిడ్డలు నగరాలకు వలసపోవడంతో గ్రామాలు జనాలు లేక కొంతవరకు పలుచబడ్డాయి. ఈ సంక్రాంతి పండుగ వేళ పల్లెలు పిల్లాపాపలతో కళకళలాడుతుంటే సంతోషంగా ఉంది.. పల్లె సౌభాగ్యమే దేశ సౌభాగ్యం. ఆనందాలు, సిరి సంపదలతో పల్లెలు సుభిక్షంగా శోభిల్లాలని, తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

## కౌశిక్ రెడ్డి పై స్పీకర్‌కు ఎమ్మెల్యే సంజయ్ ఫిర్యాదు

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్కు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.



**హైదరాబాద్, జనవరి 13, (రిపబ్లిక్ న్యూస్):** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమారు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. కరీంనగర్ కలెక్టరేట్లో జరిగిన అధికారిక సమావేశంలో దుర్భాషలాడారని అందులో పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడుతుంటే అడ్డుకున్నారని తెలిపారు. కౌశికెడ్డిపై చర్యలు తీసుకోవాలని సంజయ్ కోరారు. దీనికి స్పందించిన స్పీకర్ ప్రసాద్ కుమార్.. నివేదిక తెప్పించుకొని చర్యలు తీసుకుంటామని చెప్పారు. కరీంనగర్ కలెక్టరేట్లో అభివృద్ధి కార్యక్రమాల సన్నద్ధతపై ఆదివారం నిర్వహించిన సమావేశం రసాభాసగా మారిన విషయం తెలిసిందే. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ను ఉద్దేశించి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిరెడ్డి చేసిన వ్యాఖ్యలతో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. నీటిపారుదల శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్ఛార్జి మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి సమక్షంలోనే ఈ ఘటన జరిగింది.

## సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు నమ్మొద్దు :తితిదే ఛైర్మన్

ఇటీవల తిరుపతిలో చోటుచేసుకున్న ఘటన బాధాకరమని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు.

**తిరుమల, జనవరి 13, (రిపబ్లిక్ న్యూస్):** ఇటీవల తిరుపతిలో చోటుచేసుకున్న ఘటన బాధాకరమని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తిరుమలలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను నమ్మవద్దని ఈ సందర్భంగా బీఆర్ నాయుడు కోరారు. "నా పై కొందరు అవాస్తవ కథనాలు రాస్తున్నారు. తిరుమల విషయాల్లో నిరాధార వార్తలు రాయవద్దని విజ్ఞప్తి. ఇప్పటికే 31 మందికి చెక్కులను అందజేశాం. మిగతా 28 మందికి రేపటిలోగా అందిస్తాం. తిరుమల అనేది కోట్లాది మంది హిందువుల మనోభావాలకు సంబంధించిన విషయం. వార్తా ప్రచురణ, ప్రసారం చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు పరిశీలించుకోవాలి. మీడియా చేతిలో ఉందని ఇష్టానుసారం అసత్య వార్తలు, ప్రచారాలు చేస్తే చర్యలు తీసుకుంటాం. పాలక మండలికి, అధికారులకు మధ్య విభేదాలు ఉన్నట్లు వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నాను. అందరం సమన్వయంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. భక్తులు ప్రశాంతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటున్నారు" అని తెలిపారు.

### ఆ వార్తలు అవాస్తవం.. : తితిదే ఈవో

సామాజిక మాధ్యమాల్లో తిరుమలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తితిదే ఈవో శ్యామలరావు అన్నారు. "సమన్వయ లోపంతో తొక్కిసలాట జరిగిందనడం అవాస్తవం. తొక్కిసలాట ఘటన దురదృష్టకరం. దీనిపై విచారణ జరుగుతోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. తితిదే ఛైర్మన్తో విభేదించాననే వార్తలు అవాస్తవం" అని ఆయన పేర్కొన్నారు.



## తెలంగాణలో రవాణాశాఖ తనిఖీలు..
## ప్రైవేటు ట్రావెల్స్పై 300 కేసులు

సంక్రాంతి నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్పై రవాణాశాఖ కొరడా ఝుళిపించింది.



**హైదరాబాద్, జనవరి 13, (రిపబ్లిక్ న్యూస్):** సంక్రాంతి నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్పై రవాణాశాఖ కొరడా ఝుళిపించింది. గత నాలుగు రోజులుగా రవాణాశాఖ తనిఖీలు చేపట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల్లో 12 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టింది. హైదరాబాద్ నగరంలోని ఎల్బీ నగర్, ఆరాంఘర్ వద్ద తనిఖీల సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతోన్న ప్రైవేట్ ట్రావెల్స్పై 300లకు పైగా కేసులు నమోదు చేసినట్లు రవాణాశాఖ ఎన్ఫో-ర్స్మెంట్ జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు ఇష్టారాజ్యంగా ప్రయాణికుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయని.. ఆ నేపథ్యంలో విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు. వీటితో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.

## 470 రకాల వంటకాలు.. యానాంలో కొత్త అల్లుడికి మెగా విందు

**యానాం, జనవరి 13, (రిపబ్లిక్ న్యూస్):** గోదారోళ్ల మాటలకే కాదు.. ఆతిథ్యానికీ ప్రత్యేకత ఉంటుంది. పండగొచ్చిందంటే గోదావరి జిల్లాల ప్రజలు ఇంటికొచ్చే బంధువుల పట్ల కనబరిచే ఆప్యాయతకు అంతే ఉండదు. మర్యాదలతో చుట్టాల్ని కట్టిపడేయటంలో గోదావరి జిల్లాలకు మించినవారు లేరంటే అతిశయోక్తికాదు. ఇక ఇంటికొచ్చిన కొత్తల్లుడికి చేసే మర్యాదలు మరో స్థాయిలో ఉంటాయి. కేంద్ర పాలిత ప్రాంతం యానాం వర్తకసంఘం గౌరవాధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్, వెంకటేశ్వరి దంపతుల ఏకైక కుమార్తె హరిణ్యకు గతేడాది విజయవాడకు చెందిన పారిశ్రామికవేత్త సాకేత్తో వివాహం జరిపించారు. కొత్త అల్లుడిని మొదటి సంక్రాంతి పండుగకు ఆహ్వానించి ప్రత్యేక విందును ఏర్పాటుచేసి ఆశ్చర్యపరిచారు. శాకాహారం, పిండి వంటలు,



స్వీట్లు, పండ్లు, డ్రై ఫ్రూట్స్, శీతల పానీయాలు.. ఇలా సుమారు 470 రకాలు చిన్న చిన్న కప్పులలో ఉంచి వాటిని అందంగా అలంకరించి అల్లుడు కుమార్తె ఇద్దరినీ విందుకు ఆహ్వానించారు. ఈ మెగా విందులో వంటకాలు చూసి విజయవాడ అల్లుడు సాకేత్ ఉబ్బితబ్బిబ్బయ్యారు. అత్తవారింట్లో ఏర్పాటుచేసిన అపురూప విందును ఊహించలేదని.. శాకాహారంలో ఇన్ని రకాల ఉంటాయని ఇప్పుడే చూశాను అని అల్లుడు సాకేత్ తెలిపారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com


ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1610: గెలీలియో బృహస్పతి నాలుగవ ఉపగ్రహమైన కాలిస్టోను కనుకొన్నాడు
- 1879: 'లయన్స్‌క్లబ్' స్థాపకుడు మెల్విన్ జోన్స్ జననం.
- 1888: వాషింగ్టన్ నగరంలో నేషనల్ జాగ్రఫిక్ సొసైటీ స్థాపించబడింది.
- 1919: ఆంధ్ర ప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి డా.మర్రి చెన్నారెడ్డి జననం (మ.1996).
- 1930: వాల్ట్ డిస్నీ సృష్టించిన కార్టూన్ పాత్ర 'మిక్కీ మౌస్' కామిక్ స్ట్రిప్ తొలిసారి ఓ పత్రికలో ప్రచురితమైంది.
- 1948: గాంధీజీ తన చిట్టచివరి నిరాహారదీక్ష చేపట్టాడు. హిందూ, ముస్లిముల సమైక్యత కోరుతూ కలకత్తాలో ఈ దీక్షకు పూనుకున్నాడు.
- 1949: భారతీయ వ్యోమగామి రాకేశ్ శర్మ జననం. (చిత్రంలో)
- 1983: భారతీయ సినిమా నటుడు ఇమ్రాన్ ఖాన్ జననం.



కాలిస్టో


మెల్విన్ జోన్స్


వాషింగ్టన్


డా.మర్రి చెన్నారెడ్డి


వాల్ట్ డిస్నీ


గాంధీజీ


రాకేశ్ శర్మ


ఇమ్రాన్ ఖాన్

రిపబ్లిక్ స్పోర్ట్స్

### బుమ్రాకు తాత్కాలికంగానే సారథ్యం..

# ఆ ఇద్దరిలో డిప్యూటీ ఎవరు?

జస్‌ప్రీత్ బుమ్రా గాయంపై ఆందోళన కొనసాగుతోన్న వేళ.. కెప్టెన్సీ వార్తలు వస్తున్నాయి. అతడికి టెస్టు జట్టు పగ్గాలను అప్పజెప్పే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం.



రోహిత్ శర్మ 'మరికొన్ని నెలలు' కెప్టెన్గా ఉంటానంటూ బీసీసీఐకి చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఇంగ్లండ్తో జూన్లో జరగబోయే టెస్టు సిరీస్ కూ అతడే ఉంటాడంటూ క్రికెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కానీ, ఓ నివేదిక ప్రకారం జస్ప్రీత్ బుమ్రాను కెప్టెన్గా చేస్తారని తెలుస్తోంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ 2025 – 27 సీజన్ కూడా – అప్పుడే ప్రారంభం కానుంది. కొత్త ఎడిషన్ న్ను పూర్తిస్థాయిలో బుమ్రా సారథ్యంలో ఆడితేనే బాగుంటుందనే అభిప్రాయమూ నెలకొంది. కానీ, బుమ్రా ఫిట్నెస్పైనే ఇప్పుడందరి ఆందోళన. వెన్ను నొప్పి తిరగబెట్టడంతో బోర్డర్ గావస్కర్ ట్రోఫీ చివరి టెస్టు రెండో ఇన్నింగ్స్ బౌలింగ్ కూడా చేయలేకపోయాడు. ఈక్రమంలో సుదీర్ఘంగా బుమ్రాకు కెప్టెన్సీ అప్పగిస్తే ఇబ్బందులు తప్పవనే కోణంలోనూ బీసీసీఐ ఆలోచనలు చేసినట్లు సమాచారం. అయితే, అతడిని తాత్కాలికంగా కొన్ని రోజులు కొనసాగించి.. కొత్త సారథిని సిద్ధం చేయాలనే ఆలోచనలోనూ బోర్డు ఉన్నట్లు తెలుస్తోంది.

### పంత్, జైస్వాల్ రెడీ..

భారత జట్టును నడిపించగల సత్తా ఉన్నవారిలో రిషబ్ పంత్ ఒకడు. అతడితోపాటు యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్ కూడా సరైన వ్యక్తేనంటూ పలువురు మాజీల అంచనా. దీంతో డబ్ల్యూటీసీ కొత్త సీజన్లో బుమ్రాకు కొన్ని రోజులు డిప్యూటీగా వారిద్దరిలో ఒకరిని నియమించే అవకాశాలు లేకపోలేదు. ఆ తర్వాత బుమ్రాపై ఒత్తిడి తగ్గించేలా నూతన సారథిని ఎంపిక చేస్తే బాగుంటుందనే ఆలోచన కూడా సమీక్ష సమావేశంలో చర్చకు వచ్చింది. మాజీలు కూడా రిషభ్ పంత్ సరైన ఆప్షన్ అంటూ తమ విశ్లేషణను వెల్లడించారు. ఇప్పటికే పంత్ చాలా మ్యాచ్లు ఆడిన అనుభవం ఉందని.. యశస్వి నేర్చుకొనే దశలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పుడే కుర్రాడిపై అదనపు భారం పెట్టడం వల్ల బ్యాటింగ్ గతి తప్పే ప్రమాదం లేకపోలేదనేది వారి వాదన. అయితే, యశస్వికి గంభీర్ మద్దతు తెలిపినట్లు సమాచారం.

"జస్ ప్రీత్ బుమ్రా జట్టులో ఉండటం అత్యంత కీలకం. ఐసీసీ ఈవెంట్లు ఉన్నాయి. వచ్చే నెలలో ఛాంపియన్స్ ట్రోఫీ ఉంది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్. ఆ తర్వాత వన్డే ప్రపంచ కప్ పోటీలు ఉన్నాయి. ద్వైపాక్షిక సిరీసుల్లో కొన్నింటిని అతడు ఆడకపోయినా ఫర్వాలేదు. ఐసీసీ టోర్నీల్లో మాత్రం ఆడితేనే జట్టుకు ప్రయోజనం. మధ్యలో రెండు నెలల ఐపీఎల్ కూడా ఉంటోంది. అతడి బౌలింగ్పై వర్క్ పడనీయకుండా చూడాల్సిన బాధ్యత బోర్డుపై ఉంది. అందుకే, బుమ్రా కెప్టెన్గా ఉన్నప్పటికీ.. అతడికి బలమైన డిప్యూటీని నియమించాలి. అందుకు పంత్ సరిగ్గా సరిపోతాడు" అని మాజీ క్రికెటర్ దీప్ దాస్ గుప్తా వెల్లడించాడు.

# నెట్టింట 'డాకు మహారాజ్' సందడి.. తొలిరోజు కలెక్షన్లు ఎంతంటే!

నెట్టింట 'డాకు మహారాజ్ సందడి చేస్తున్నాడు. ఆ సినిమాకు సంబంధించిన ఫొటోలు అభిమానులు షేర్ చేస్తున్నారు.



సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చిన 'డాకు మహారాజ్ హిట్ టాక్ను సొంతం చేసుకుంది. దీంతో చిత్రబృందంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తూ శుభాకాంక్షలు చెబుతున్నారు. మరోవైపు మూవీ టీమ్ కూడా ఈ హిట్ను సెలబ్రేట్ చేసుకుంటోంది.

### తొలిరోజు వసూళ్లు ఎంతంటే..

బాబీ దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నటించిన 'డాకు మహారాజ్ తొలిరోజు రూ.56 కోట్లు వసూలు చేసినట్లు టీమ్ అధికారికంగా ప్రకటించింది. దీంతో బాలకృష్ణ కెరీర్లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల లిస్ట్లో 'డాకు మహారాజ్ చేరింది.

### దర్శకుడిపై బాలయ్య ప్రేమ..

సినిమా ప్రకటించిన నాటినుంచి విజయంపై ధీమాగా ఉన్నారు దర్శకుడు బాబీ. చిత్రం విజయం సాధించడంతో ఆయన ఆనందం రెట్టింపు అయింది. ఇక ఓవర్సీస్లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో బాబీపై బాలకృష్ణ ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే. తాజాగా సినిమా రిలీజ్ అనంతరం జరిగిన పార్టీలో బాబీను బాలయ్య ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని ఆయనపై ప్రేమ కురిపించారు. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట వైరల్ గా మారింది. ఇక ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధూజొన్నలగడ్డ, విష్వక్ సేన్లను కూడా బాలకృష్ణ ఆప్యాయంగా పలకరించారు.

### వైరలవుతోన్న డైలాగులు..

బాలకృష్ణ సినిమా అంటే మాస్ ఎలివేషన్స్తో పాటు డైలాగులకు ప్రాధాన్యం ఉంటుంది. తాజాగా విడుదలైన 'డాకు మహారాజ్లోనూ బాలయ్య మార్క్ డైలాగులు అభిమానుల్లో జోష్ నింపుతున్నాయి. భాను భోగవరపు, నందు మాటలు ఆకట్టుకుంటాయి. 'సింహం నక్కల మీద కొస్తే వార్ అవ్వదు'.. 'వార్నింగ్ చంపేవాడు ఇవ్వాలి. చచ్చేవాడు కాదు'.. తరహా డైలాగులు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి.

### వన్ మిలియన్ క్లబ్లోకి 'డాకు మహారాజ్..

ఓవర్సీస్లో టికెట్స్ ఓపెన్ చేసిన నాటినుంచి బుకింగ్స్లో హవా చాటిన 'డాకు మహారాజ్' తొలిరోజు వన్ మిలియన్ క్లబ్లోకి చేరింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ ప్రత్యేక పోస్టర్ను పంచుకుంది. దీంతో సంక్రాంతి విన్నర్ బాలయ్య అంటూ ఫ్యాన్స్ ఖుష్ అవుతున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## 'గేమ్ ఛేంజర్' విషయంలో బెదిరింపులు.. ఫిర్యాదు చేసిన చిత్ర బృందం

రామ్ చరణ్ హీరోగా దర్శకుడు శంకర్ తెరకెక్కించిన చిత్రం 'గేమ్ ఛేంజర్. ఈ సినిమా విషయంలో బెదిరింపులురాగా టీమ్ సైబర్ క్రైమ్లో ఫిర్యాదు చేసింది.



తాము అడిగినంత డబ్బు ఇవ్వకపోతే 'గేమ్ ఛేంజర్' సినిమాని లీక్ చేస్తామంటూ బెదిరించిన వారిపై చిత్ర బృందం సైబర్ క్రైమ్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సినిమా విడుదలకు ముందు నిర్మాతలతో పాటు టీమ్లోకి కొందరు కీలక వ్యక్తులకు వాట్సాప్, సోషల్ మీడియా వేదికగా డబ్బు ఇవ్వాలంటూ బెదిరింపులు వచ్చాయి. అడిగిన మొత్తాన్ని ఇవ్వకపోతే మూవీని లీక్ చేస్తామంటూ కొందరు బ్లాక్ మెయిల్ చేశారు. మూవీ రిలీజ్కు రెండు రోజుల ముందు కీలక సన్నివేశాలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. మరోవైపు, సినిమా రిలీజైన రోజే ఆన్లైన్లో లీక్ చేశారు. ఆధారాలు సేకరించిన చిత్ర బృందం.. 45 మందితో కూడిన ముఠాపై తాజాగా ఫిర్యాదు చేసింది. ఈ ముఠా వెనుక ఉన్నదెవరు? అనే కోణంలో పోలీసులు ఇన్వెస్టిగేషన్ చేస్తున్నట్టు సమాచారం. మరోవైపు, సోషల్ మీడియా వేదికగా సినిమాపై నెగెటివిటీ సృష్టిస్తున్న కొన్ని ఖాతాలపైనా 'గేమ్ ఛేంజర్' టీమ్ కంప్లైంట్ ఇచ్చింది. రామ్ చరణ్ హీరోగా దర్శకుడు శంకర్ తెరకెక్కించిన చిత్రమిది. సంక్రాంతి కానుకగా ఈ నెల 10న బాక్సాఫీసు ముందుకొచ్చింది.

## నేను ఇంకా బతికి ఉన్నానంటే అదే కారణం: గౌతమ్ వాసుదేవ్ మేనన్



అవసరమైనప్పుడు ఇండస్ట్రీలో ఎవరూ సహకరించరని ప్రముఖ దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్ అసహనం వ్యక్తంచేశారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన పరిశ్రమలో తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి పంచుకున్నారు. "ఈ విషయం గురించి మాట్లాడుతున్నందుకు ఎంతో బాధగా ఉంది. ఇండస్ట్రీలో నాకు సాయం చేయడానికి ఎవరూ లేరు. నమ్మడానికి కష్టంగా ఉన్నా ఇదే నిజం. నేను తీసిన 'ధ్రువ నక్షత్రం' విడుదల విషయంలో సమస్యల గురించి ఎవరూ స్పందించలేదు. కనీసం ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి కూడా ప్రయత్నంచలేదు. ఇండస్ట్రీ ఆ చిత్రాన్ని పట్టించుకోలేదు. ఆ సినిమా గురించి కూడా ఎవరికీ తెలియదు. ధనుష్, లింగుస్వామి మాత్రమే దీని గురించి అడిగారు. విడుదల చేయడానికి ప్రయత్నించారు. కొన్ని స్టూడియోల వారికి ఈ సినిమాను చూపించాను. కానీ, కొన్ని సమస్యలు ఉన్నందున ఎవరూ దాన్ని స్వీకరించలేదు. విడుదల చేయడానికి ముందుకురాలేదు. ప్రేక్షకులు ఇంకా నా సినిమాలను చూడాలని కోరుకుంటున్నారు కాబట్టే నేను బతికి ఉన్నాను" అని అన్నారు. విక్రమ్ హీరోగా దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్ తెరకెక్కించిన చిత్రం 'ధ్రువ నక్షత్రం'. ఏడేళ్ల క్రితమే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆర్థిక సమస్యల కారణంగా విడుదల కాలేదు. దీనిపై ఇప్పటికే పలుమార్లు గౌతమ్ వాసుదేవ్ మేనన్ అసహనం వ్యక్తంచేశారు. ఇది వాయిదా పడడం ఎంతో బాధగా ఉందన్నారు. 'ఇది చాలా హృదయవిదారకంగా ఉంది. చిత్రం వాయిదా విషయంలో ఎన్నో రోజులుగా మనశ్శాంతి లేదు. నా కుటుంబం ఆందోళన చెందుతోంది. నా భార్య నెల రోజులుగా ఈవిషయమే ఆలోచిస్తోంది. నాకు ఎటైనా వెళ్లిపోవాలనిపిస్తోంది. కానీ, పెట్టుబడిదారులకు సమాధానం చెప్పాలని ఉంటున్నా' అని ఓ సందర్భంలో తెలిపారు.

## ఆరోగ్యం

# సంక్రాంతికి గ్యాస్ట్రిక్ సమస్యలకు చెక్ పెట్టే చిట్కాలు, ఏది తిన్నా ఆరాయించుకుంటారు

ఇంట్లో తయారుచేసిన పిండి వంటకాల్ని కూడా లాగించేస్తున్నారు. అయితే, ఈ సమయాల్లో ఆరోగ్యం మీద దృష్టి పెట్టడం సాధ్యం కాదు. ఎక్కువగా స్పైసీ ఉన్న ఫుడ్, స్నాక్స్, వేయించిన ఆహారాలు తీసుకోవడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు ఎదుర్కోవచ్చు.



ఇంట్లో తయారుచేసిన పిండి వంటకాల్ని కూడా లాగించేస్తున్నారు. అయితే, ఈ సమయాల్లో ఆరోగ్యం మీద దృష్టి పెట్టడం సాధ్యం కాదు. ఎక్కువగా స్పైసీ ఉన్న ఫుడ్, స్నాక్స్, వేయించిన ఆహారాలు తీసుకోవడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు ఎదుర్కోవచ్చు. సంక్రాంతి.. రెండు తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద పండగ. ఈ పండగను మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ.. ఇలా ప్రతి రోజూ కూడా ప్రాధాన్యతను సంతరించుకుంది. ముత్యాల ముగ్గులు, నవధాన్యాలు, గంగిరెద్దుల విన్యాసాలు, గాలి పటాలు, కోడి పందేలు, హరిదాసుల కీర్తనలు, బొమ్మల కొలువులు ఇలా ప్రతి ఇంటా ఆనందాన్ని నింపే పర్వదినమే సంక్రాంతి. ఇక, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పండుగకి స్కూళ్లతో పాటు కాలేజీలకు కూడా సెలవులు ఇచ్చారు. వివిధ ప్రాంతాల్లో పనిచేసేవారు ఈ పర్వదినానికి సెలవులు పెట్టి పల్లె లోగిళ్లలో వాలిపోతారు. సంక్రాంతి సెలబ్రేషన్స్‌లో పిండి వంటలు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. రకరకాల పిండి వంటలు అందర్నీ నోరూరిస్తాయి. ఇంకేముంది సంక్రాంతి సెలబ్రేషన్స్‌లో ఓ పట్టు పట్టేస్తున్నారు. ఇంట్లో తయారుచేసిన పిండి వంటకాల్ని కూడా లాగించేస్తున్నారు. అయితే, ఈ సమయాల్లో ఆరోగ్యం మీద దృష్టి పెట్టడం సాధ్యం కాదు. ఎక్కువగా స్పైసీ ఉన్న ఫుడ్, స్నాక్స్, వేయించిన ఆహారాలు తీసుకోవడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు ఎదుర్కోవచ్చు. అయితే, పండుగ సమయాన్ని ఎంజాయ్ చేయాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. ఈ చిట్కాలతో మీరు హాయిగా తినవచ్చు. ఈ చిట్కాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.

### స్పైసీ ఫుడ్ తినడం వల్ల వచ్చే సమస్యలు



సంక్రాంతికి చాలా మంది పిండి వంటలతో పాటు స్పైసీ ఫుడ్స్, మసాలా ఆహారాలు, బిర్యానీలు తింటుంటారు. అయితే, వీటిని ఎక్కువ మోతాదులో తినడం వల్ల కొన్ని రకాల ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కోవచ్చు. అందులో ప్రధానంగా గ్యాస్ట్రిక్ సమస్య ఒకటి. సంక్రాంతి సమయంలో చాలా మంది ఆరోగ్యంపై దృష్టి పెట్టరు. దీంతో.. ఎక్కువగా వేయించిన ఫుడ్స్ తినడం వల్ల కడుపు, జీర్ణక్రియకు సంబంధించిన అనేక సమస్యలు సంభవిస్తాయి. ఈ సమస్యలలో కడుపు నొప్పి, పేలవమైన జీర్ణక్రియ, ఆమ్లత్వం, గ్యాస్, మలబద్ధకం, కడుపు, ఛాతీలో మంట, వాంతులు, విరేచనలు వంటివి ఉన్నాయి. కొన్ని చిట్కాలతో ఈ సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

### ఎక్కువ నీళ్లు తాగండి



సంక్రాంతి సమయంలో పిండి వంటకాల్ని ఓ పట్టు అయితే పడతాం కానీ.. ఎక్కువ నీళ్లు మాత్రం తాగం. మనం చేసే అతి పెద్ద తప్పు ఇదే. శరీరానికి ఎల్లప్పుడూ హైడ్రేషన్ అవసరం. అందుకే ప్రతి రోజూ నీరు ఎక్కువగా తాగాలి. అంతేకానీ.. తినడం మీద ఎక్కువ దృష్టి పెట్టి.. నీళ్లు తాగే లక్ష్యాన్ని మర్చిపోకూడదు. నీళ్లు ఎక్కువ తాగితే జీవక్రియ సరిగ్గా జరుగుతుంది. దీంతో.. చాలా సమస్యల దరి చేరవు.

### వేయించిన ఆహారాన్ని అవాయిడ్ చేయండి




పండగ కదా అని చాలా మంది ఎలా పడితే అలా తింటుంటారు. అయితే, చాలా మంది చేసే తప్పు ఇదే. పండగ సమయంలో ఎక్కువగా వేయించిన ఆహారం తినడాన్ని కంట్రోల్ చేసుకోవాలి. అంతేకాకుండా ఎక్కువగా తినకూడదు. మితంగా తింటే ఆరోగ్యానికి మంచిది. లేదంటే కాస్త గ్యాప్ ఇచ్చిన తర్వాత మరో చిరుతిండి తినవచ్చు. అయితే.. నూనెలో బాగా వేయించిన ఫుడ్స్ మాత్రం ఎక్కువ తినకూడదని గుర్తించుకోవాలి. దీంతో, గ్యాస్ సమస్యల్ని కంట్రోల్ చేయవచ్చు.

### ఫైబర్ ఫుడ్స్ ఎక్కువ తీసుకోండి





ఫెస్టివల్ టైంలో ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారాల్ని తినండి. ఫైబర్ ఎక్కువగా ఉన్న ఫుడ్స్ తినడం వల్ల జీర్ణక్రియ మెరగవుతుంది. మలబద్ధకం సమస్య ఉన్నవారు ఫైబర్ ఫుడ్స్ ఎంత ఎక్కువ తీసుకుంటే అంత మంచిది .అయితే.. ఆహారంతో పాటు సలాడ్ కూడా తీసుకోవచ్చు.

### అవసరమైన వ్యాయామాలు చేయండి



గ్యాస్ట్రిక్ సమస్యలను నివారించడానికి.. మీరు తిన్న తర్వాత కొన్ని అవసరమైన వ్యాయామాలు లేదా యోగా చేయాలి. పెద్ద పెద్ద వ్యాయామాలు అవసరం లేదు. తేలికపాటి నడక, ఈజీగా ఉండే యోగాసనాలు వేస్తే సరిపోతుంది. దీంతో.. మీరు తిన్నది సులభంగా జీర్ణమవుతుంది. అంతేకాకుండా గ్యాస్ట్రిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

### ఆహారాన్ని పూర్తిగా నమలండి



ఆహారాన్ని ఎంత బాగా నమిలితే.. అది అంత త్వరగా జీర్ణమవుతుంది. ఆహారాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని తింటే మంచిది. ఇలా తినడం వల్ల బాగా నమిలే అవకాశం ఉంటుంది. ఆహారాన్ని బాగా నమిలి తినడం వల్ల జీర్ణక్రియ మెరుగై.. గ్యాస్ సమస్యల్ని తగ్గిస్తుంది.

### ధూమపానం, మద్యపానం చేయకండి..



చాలా మంది పండగ కదా అని మద్యపానం, ధూమపానం ఎక్కువగా చేస్తూ ఉంటారు. అయితే, ఇలాంటి పండగ సమయాల్లోనే వీటికి దూరంగా ఉండాలి. ఎందుకంటే పండుగ వేళల్లో మనం చాలా రకాల ఆహారాలు తింటూ ఉంటాం. ఈ సమయాల్లో వీటిని తీసుకుంటే.. ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

గమనిక ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.